క్లుప్తంగా

విద్యార్థిపై దాడి ఘటనలో అధికారుల విచారణ



దామెర : విద్యార్థిపై దాడిచేసి గాయపర్చిన ఘటనపై సోమవారం అధికారులు విచారణ చేపట్టారు. ఒగ్లాపూర్ సమీపంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఆరో తరగతి విద్యార్థిపై అదే తరగతికి చెందిన విద్యార్థులు ఆదివారం దాడిచేసి గాయపర్చిన విషయం తెలిసిందే. కాగా సోమవారం పాఠశాలకు ఎస్సై కొంక అశోక్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ చేరుకొని బాధిత విద్యార్థితో పాటు ఇతర విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలని అన్నారు. చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. మొదటి తప్పుగా భావిస్తున్నామని, భవిష్యత్‌లో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కావొద్దని హెచ్చరించారు. ప్రిన్సిపాల్ సమ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు పులుకుర్తి విద్యార్థి



దామెర : మండలంలోని పులుకుర్తి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఒంటేరు దూమిని రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బానోతు జుమ్మునాయక్ సోమవారం తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో 14 సంవత్సరాల విభాగంలో దూమిని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈనెల 29 నుంచి 30వ తేదీ వరకు మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు అమరేందర్, రాధకృష్ణ, మురళీధర్, దేవసేన, రాజు, రామకృష్ణ, కవిత, పీడీ రాజేశ్వర్ అభినందించారు.

స్నేహితురాలికి చేయూత



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన ఎండీ. అబేద కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. విషయం తెలుసుకున్న ఆమెతో పాటు 2003–24లో పదోతరగతి చదువుకున్న స్నేహితులు, ఉపాధ్యాయులు సోమవారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. తలోకొంత పోగుచేసి రూ. 18,500 వైద్య ఖర్చుల కోసం అందించారు. తమతో కలిసి చదువుకున్న తోటి స్నేహితులకు ఏ ఆపద వచ్చినా ఆదుకోవడానికి తాము ముందుంటామని తెలిపారు. అందించిన వారిలో రమాదేవి, ప్రశాంత్, కర్ణాకర్, రాజు, పునేశ్, నాగేశ్వరరావు, సుమన్ ఉన్నారు.

క్విజ్ పోటీల్లో ప్రతిభ



శాయంపేట : మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శ్రీమాన్ జిల్లాస్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి తృతీయ బహుమతి సాధించినట్లు ప్రిన్సిపాల్ రేవతి సోమవారం తెలిపారు. హనుమకొండలో ఆదివారం జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య చేతులమీదుగా బహుమతి అందుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

47వసారి రక్తదానం చేసిన అశోక్



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు అమ్మ అశోక్ 47వ సారి రక్తదానం చేశారు. పరకాల ప్రభుత్వ ఆస్పత్రిలో చంద్రయ్య అనే పేషంట్‌కు రక్తం అవసరం కాగా అశోక్ స్పందించారు. వెంటనే రక్తదానం చేసి పలువురి ప్రశంసలు పొందారు. ఈమేరకు ఆస్పత్రి ఆర్ఎంఓ బాలకృష్ణ అతడికి సర్టిఫికెట్ అందించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు.

అర్హుల జాబితా.. అయోమయం



నీరుకుళ్ల గ్రామసభలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజలు (ఫైల్)



మండల పరిషత్ వద్ద నిరసన తెలుపుతున్న వృద్ధులు



నాగయ్యపల్లి గ్రామసభలో ఆందోళన చేస్తున్న ప్రజలు (ఫైల్)

- పేర్లు రాకపోవడంపై పలువురి ఆవేదన
- ఇటీవల పూర్తైన గ్రామసభల్లో అధికారుల నిలదీత
- ప్రస్తుతం అధికారుల చుట్టూ చక్కర్లు

ఆత్మకూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక ప్రక్రియ ప్రజలను అయోమయానికి గురిచేస్తోంది. అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడంతో పలువురు అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్‌కార్డులకు సంబంధించి ఈనెల 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి జాబితాను గ్రామపంచాయతీల్లో ప్రదర్శించిన విషయం తెలిసిందే. అయితే తమ పేర్లు లేకపోవడంతో అనేక గ్రామాల్లో అర్హులు విస్మయానికి గురయ్యారు. మండల కేంద్రంలోనే ఇందిరమ్మ గృహనిర్మాణ దరఖాస్తులు వెయ్యికిపైగా తిరస్కరణకు గురైనట్లు సమాచారం. అద్దె ఇంట్లో ఉంటున్న వారి దరఖాస్తులు సైతం ఆర్‌సీసీ కప్పు ఉందనే సాకుతో తిరస్కరణ అయినట్లు తెలిసింది. దీంతో కొంతమంది మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. అలాగే కూలీలకు సంబంధించిన ఆత్మీయ భరోసాలో ఉపాధి కూలీలు 20రోజులు పనిచేయాలనే నిబంధన పెట్టడంతో అనేక మంది కూలీలు ఈ పథకానికి దూరమయ్యారు. భూమి ఉన్నవారు ఎంపికయ్యారని, తమకు చోటు దక్కలేదని పలువురు అధికారుల ఎదుట వాపోతున్నారు. అలాగే మండలంలోని చౌళ్లపల్లి గ్రామానికి చెందిన ఎల్లమ్మ అనే మహిళ గృహజ్యోతి పథకం వర్తించడం లేదని, నీరుకుళ్లకు చెందిన సారమ్మ, సుగుణమ్మకు వ్యవసాయ భూమిలేకున్నా ఆత్మీయ భరోసాకు పథకానికి ఎంపిక కాలేదని సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల ఎదుట నిరసన తెలిపారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం

గ్రామాల్లో అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో స్లాబ్ కలిగివున్న అద్దె ఇళ్లలో నివసిస్తున్న వారి దరఖాస్తులు రిజక్ట్ అయిన విషయం వాస్తవమే. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అందరికీ లబ్ధిచేకూరుస్తాం. జాబితాలో పేర్లులేని వారినుంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించాం.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ

అదనపు నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పద్మశాలీలు

శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామంలో నిర్మిస్తున్న పద్మశాలి కమ్యూనిటీ భవనానికి అదనపు నిధులు మంజూరు చేయాలని మండలంలోని పద్మశాలీలు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును కోరారు. ఈ మేరకు సోమవారం భూపాలపల్లి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. పత్తిపాక గ్రామంలో పద్మశాలి కమ్యూనిటీ భవన నిర్మాణానికి మరిన్ని నిధులు ఇవ్వాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీలు కందగట్ల ప్రకాశం, గుర్రం రమేష్, సూర్యనారాయణ, కుమారస్వామి, తిరుపతి, ప్రవీణ్, నవీన్, భిక్షపతి, రాజమొగిలి, శ్రీధర్, చంద్రప్రకాశ్, శివరాజు, వెంకటేశ్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ



దున్నపోతుకు వినతిపత్రం అందజేసి నిరసన తెలుపుతున్న నాయకులు

శాయంపేట : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివ, మైలారం మాజీ సర్పంచ్ అరికిల్ల ప్రసాద్ విమర్శించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా సోమవారం దున్నపోతుకు వినతిపత్రం అందించిన నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుందని, దొంగ హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని దుయ్యబట్టారు. రాష్ట్రం ప్రభుత్వం గణతంత్ర దినోత్సవం రోజు నాలుగు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి మిగిలిన గ్రామాలకు మార్చిలోపు అమలు చేస్తామని మాట మార్చడం సిగ్గుచేటన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. నాయకులు మారెపల్లి మోహన్, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, సదయ్య, రాజ్‌మహ్మద్, అశోక్, వెంకట్, రియాజ్ పాల్గొన్నారు.

యుద్ధభేరిని జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు : ఫిబ్రవరి 2వ తేదీన హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరగనున్న బీసీ రాజకీయ యుద్ధభేరి సభను జయప్రదం చేయాలని బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు బొల్లబోయిన రవియాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని అక్కంపేటలో సోమవారం సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి పోరాటమే మార్గమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కూస కుమారస్వామి, నాయకులు రాజు, రాజ్‌కుమార్, ముల్కనూరు శ్రీనివాస్, రేగుల రవి, రారాకుల చంద్రమౌళి, నూనె మొండయ్య, రేగుల వీరేశం పాల్గొన్నారు.

గ్రామసభల పేరుతో గందరగోళం



మాట్లాడుతున్న మధుకర్

ఆత్మకూరు : కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరుతో గందరగోళం చేసిందని, ఏ ఒక్కరికీ గ్రామసభల ద్వారా లబ్ధిచేకూరలేదని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు అర్షం మధుకర్ విమర్శించారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మభ్యపెట్టేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజాపాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ప్రశ్నించినందుకు మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడం సరికాదన్నారు. ప్రజల పక్షాన ప్రతిపక్షం ప్రశ్నిస్తుందని అన్నారు. ఈ సమావేశంలో చల్లా యువసేన నాయకులు వేల్పుల గణేశ్, రత్నాకర్, అరవింద్‌గౌడ్, రాజ్‌కుమార్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జా చేసినవారిపై చర్య తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామెర : మండలంలోని ముస్త్యాలపల్లికి చెందిన సిలువేరు భిక్షపతికి చెందిన భూమిని కబ్జాచేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు మన్నె బాబురావు, దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుంచు రాజేందర్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు అంకేశ్వరపు రాంచందర్, వీడీఎంసీ సభ్యుడు సింగారపు రవిప్రసాద్ వినతిపత్రం అందించారు. ముస్త్యాలపల్లి గ్రామంలో 225–1 సర్వే నంబర్‌లో భిక్షపతికి ఇందిరా గాంధీ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రభుత్వం 2 ఎకరాల 4 గుంటలు భూమిని పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇందులో నుంచి 22 గుంటల భూమి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పిల్లమర్రి సతీశ్ ఆక్రమించి తన భార్య పుష్పలత పేరున రిజిస్ట్రేషన్ చేయించినట్లు వినతిలో పేర్కొన్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా రెవెన్యూ, అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు.

పీహెచ్‌సీని సందర్శించిన పీఆర్‌సీ టీం

ధర్మసాగర్ : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారి ఇఫ్తికర్ అహ్మద్ ఆధ్వర్యంలో సోమవారం పాపులేషన్ రీసెర్చ్ సెంటర్ టీం (పీఆర్‌సీ) సందర్శించింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో ఆరోగ్య సేవలు అడిగితెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని ఉనికిచర్ల సబ్‌సెంటర్‌ను సందర్శించిన టీం సభ్యులు శ్రావణ్‌కుమార్, రాజ్‌కుమార్ రికార్డులను పరిశీలించి వారు అందిస్తున్న ఆరోగ్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారి గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ ఆఫీసర్‌గా వెంకట్‌రెడ్డి

పరకాల : మున్సిపల్ పాలకవర్గం పదవికాలం ముగియడంతో మున్సిపల్ ప్రత్యేక అధికారిగా నియామకమైన జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ సుష్మ స్పెషల్ అధికారి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

కలిసికట్టుగా పనిచేయాలి

ఆత్మకూరు : కాంగ్రెస్ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. నాయకులు విభేదాలకు తావీయడం బాగుండదని, అందరు కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.

పరామర్శ

వేలేరు : మండల కేంద్రానికి చెందిన మోతె జాన్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుడా మాజీ డైరెక్టర్ బిల్లా యాదగిరి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కేజీల బియ్యం అందించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్, నాగరాజు, శ్రీకాంత్, శ్రవణ్, అనిల్ పాల్గొన్నారు.

పరకాలలో మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పరకాల : మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రేగూరి విజయ్‌పాల్‌రెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి (70) అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వెంకట్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.

స్వాతంత్ర సమరయోధుడికి నివాళి

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు గోలి నారాయణరెడ్డి సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నారాయణరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా నారాయణరెడ్డి 20 ఏళ్లుగా వరుసగా మండలంలోని కొప్పుల సర్పంచ్‌గా సేవలందించారు.

చిత్రలేఖనం విజేతలకు అభినందన

మామునూరు: ఇటీవల జరిగిన జాతీయస్థాయి చిత్రలేఖనం పోటీల్లో మామునూరు టీజీఎస్పీ నాలుగో బెటాలియన్ పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పోటీల్లో 102మంది విద్యార్థులు పాల్గొనగా 10 మంది గోల్డ్‌మెడల్, ఎనిమిది మంది సిల్వర్, నలుగురు కాంస్య పతకాలు సాధించారు. ఈ మేరకు సోమవారం వారిని పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, శాంతకుమారి, తదితరులు అభినందించారు.

జిమ్నాస్టిక్స్‌లో విద్యార్థి ప్రతిభ

ఖిలా వరంగల్: హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో సోమవారం జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్థాయి జిమ్నాస్టిక్స్ పోటీల్లో వరంగల్ ఆర్‌టీఏ జంక్షన్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి రాజ్యలక్ష్మి ప్రతిభ కనబరిచింది. ఈ మేరకు ఆల్‌ఇండియా యూనివర్సిటీ పోటీలకు ఎంపికైంది. ఆమెను కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపాల్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ మమత, ఫిజికల్ డైరెక్టర్ పద్మతో పాటు తదితరులు అభినందించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఖిలా వరంగల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతీఒక్కరి బాధ్యత అని వరంగల్ మట్టెవాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ సూచించారు. ఈ మేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్ షైన్ హైస్కూల్ ప్రాంగణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ద్విచక్ర వాహనంపై వెళ్లేటప్పుడు వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు అజయ్, ఆసిస్ పాల్గొన్నారు.

నందీశ్వరుడికి ప్రదోషకాల అభిషేకం



ప్రదోషకాలంలో నందీశ్వరుడి అభిషేకంలో పాల్గొన్న భక్తులు



రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

ఐనవోలు : మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని సోమవారం ప్రదోష వేల నందీశ్వరుడికి అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో రుద్రుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా స్వామివారి కల్యాణం, రుద్రహోమం, ఒగ్గు పూజారులు పెద్దపట్నం వేశారు. సాయంకాలం సూర్యాస్తమయం తర్వాత ప్రదోష కాలంలో మల్లికార్జున స్వామి గర్భాలయానికి ఎదురుగా ప్రతిష్టితమైన నందీశ్వరుడిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పండ్ల రసాలతో అభిషేకించారు. నందీశ్వరుడికి వస్త్రధారణ చేసి, ధూపం వేసి గంధం బొట్టుపెట్టి అలంకరించారు. వేదోక్తంగా పూజించి పండ్లు ఫలాలతో నైవేద్యం సమర్పించారు. ప్రత్యేకంగా శనిగల ప్రసాదం నందీశ్వరుడి ముఖానికి కట్టి, వడమాలను మెడలో వేసి సమర్పించారు. అనంతరం ఏక కాలంలో నందీశ్వరుడికి, గర్భాలయంలో రుద్రుడికి నక్షత్ర హారతి సమర్పణ కార్యక్రమం కనుల పండువగా జరిపించారు. ఆర్జిత సేవా టికెట్ భక్తులకు స్వామి వారి శేష వస్త్రాలతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్‌శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, నరేష్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిజాయితీగా ఓటేద్దాం.. మంచికోసం అడుగేద్దాం

- కానిపర్తిలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ



స్నేహ సేవా ఫౌండేషన్ వారు ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

కమలాపూర్ : భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకొని 'నిజాయితీగా ఓటేద్దాం.. మంచి కోసం తొలి అడుగేద్దాం' అంటూ మండలంలోని కానిపర్తిలో వెలిసిన ఫ్లెక్సీలు పలువురిని ఆలోచింపజేస్తున్నాయి. స్నేహ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కానిపర్తిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కానిపర్తి అభివృద్ధి కోసం గ్రామ పౌరులుగా గ్రామాభివృద్ధి కోరుకోవడం మన ప్రధాన బాధ్యత అని, గ్రామంలో అభివృద్ధి జరిగితే మనకు, ముందు తరాలకు మేలు జరుగుతుందని ఆ ఫ్లెక్సీల్లో ముద్రించారు. గ్రామానికి వచ్చే నిధులను అభివృద్ధి కార్యక్రమాల కోసమే ప్రభుత్వాలు ఇస్తాయని, గెలిచిన నాయకులు దోచుకోవడానికి కాదని, నాయకులు నిజాయితీతో పని చేయాలని, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు జరగాలంటే ముందు ఓటర్లు నిజాయితీగా ఉండి ఓట్లు వేయాలని, మందు, మనీ వంటి ప్రలోభాలకు లొంగవద్దని, నీవు నిజాయితీగా ఓట్లు వేస్తే రేపు గెలిచిన నాయకులు అవినీతి చేస్తే నిలదీసే హక్కు ఉంటుందని అందులో పేర్కొన్నారు. ఏ పార్టీ వాళ్లు, ఏ కులం వాళ్లు ఎన్నికల్లో పోటీ చేసినా మద్యం, మనీ తీసుకోకుండా ఓట్లు వేద్దామని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు శక్తికి మించి డబ్బులు పంచి గెలిశాక నిస్వార్థంగా పని చేయడం అసాధ్యమని, గెలవడానికి ఖర్చు చేసిన డబ్బులు సంపాదించాలంటే అవినీతికి పాల్పడాల్సిందేనని పేర్కొన్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పార్టీలకు అతీతంగా జరుగుతాయని, అభ్యర్థులు కూడా పార్టీలకతీతంగా ప్రచారం నిర్వహిస్తూ ఎన్నికల సంఘం విధించిన పరిమితికి లోబడి ఖర్చు చేయాల్సి ఉంటుందని, మందు, మనీ పంపిణీ నిషేధమని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధుల వివరాలు, వివిధ పథకాల కోసం వచ్చే నిధులు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల జమ, ఖర్చులు పూర్తిగా గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులకు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు డబ్బు ఖర్చు పెట్టకుండా నియంత్రించి గ్రామాభివృద్ధి చేసే వారినే గెలిపించుకుని వారితో నిజాయితీగా గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామంటూ ఫ్లెక్సీల్లో ముద్రించి ఉంది.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి



బహుమతులు అందజేస్తున్న ఇందిర, తదితరులు

కమలాపూర్ : విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పోటీతత్వం అలవర్చుకోవాలని సర్వోదయ సంస్థ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ ఇందిర సూచించారు. మండలంలోని అంబాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బాలల పరిరక్షణ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం విద్యార్థులు అన్ని రంగాల్లో అత్యున్నత ప్రతిభ కనబరుస్తున్నారని, చిన్నతనం నుంచే వికాసం, విజ్ఞానం పెంపొందించుకునే అలవాట్లు, ఆలోచనలు కలిగి ఉండాలన్నారు. విద్య మానవాభివృద్ధికి చాలా ముఖ్యమని, గ్రామీణ ప్రాంతాల్లో డ్రాపౌట్స్ లేకుండా చూడాలన్నారు. రానున్న మూడేళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కనీసం 2 వేల మంది విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తూ, విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేసి ప్రోత్సహిస్తామని, సమాజంలో జరిగే అంశాలపై అవగామన కల్పిస్తూ చైతన్య పరుస్తామన్నారు. అనంతరం గత నెలలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ట్రైనింగ్ ప్రోగ్రాం మేనేజర్ కవిరాజ్, కో ఆర్డినేటర్ శ్రీలత, హెచ్ఎం రోజారమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ వరం

- వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

ఐనవోలు : అనారోగ్యం బారిన పడిన పేదలకు సీఎంఆర్ఎఫ్ వరంగా నిలుస్తోందని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 41 మంది లబ్ధిదారులకు రూ.11.34 లక్షల విలువచేసే చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందన్నారు. ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా పారదర్శకంగా సర్వేలు చేసి అర్హులకు న్యాయం చేస్తున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మెట మహేందర్, గడ్డం సాయి, తంగళ్లపల్లి తిరుపతి, కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, సాయిరెడ్డి, బుచ్చిరెడ్డి, ఎలిషాతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

ధర్మసాగర్ : రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘం నాయకుడు బొల్లెడ్ల పాపిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో కంటి సమస్యలు, గుండె సంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు, గొంతు (ఈఎన్‌టీ) వైద్య పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలోని ఆర్ఎస్‌రెడ్డి పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్యశిబిరాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.